సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 24 । అక్టోబర్ । 2024



నష్టపరిహారం చెల్లించాలి

నకిలీ విత్తనాలతో మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సుజాతనగర్ లో రైతులు ఆందోళనకు దిగారు. 8లో



.. మరో అవినీతి పర్వం

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలోని ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో అవినీతి వ్యవహారం వెలుగుచూసింది. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం వేళలో ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అండర్ -14 జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక



జాతీయ జట్టుకు ఎంపికైన రిత్విక్

భద్రాచలంఅర్బన్: జాతీయ స్థాయి అండర్ -14 క్రికెట్ జట్టు ఎంపికలు గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించగా, జట్టులో భద్రాచలానికి చెందిన రిత్విక్‌కు చోటు దక్కింది. జట్టు ఎంపికకు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించగా రిత్విక్ బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో మొదటి రౌండ్‌లోనే ఎంపికయ్యాడు. ప్రస్తుతం భద్రాచలంలోని బెస్ట్ క్రికెట్ అకాడమిలో సాయితేజ (తేజ), ఆనంద్ పాల్(బుజ్జి) ఆధ్వర్యంలో రిత్విక్ తర్ఫీదు పొందుతున్నాడు. చిన్ననాటి నుంచే క్రికెట్ పట్ల ఆసక్తి పెంచుకోవడంతో తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. కాగా ఆటలతో పాటు చదువులోనూ చురుగ్గా ఉండే రిత్విక్ పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నాడు. రిత్విక్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక సెలవులో ఏఈఓలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని 67 మంది వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓ)లు బుధవారం సామూహికంగా సెలవు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓలు డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో అభ్యంతరాలు తెలుపుతుండగా.. 165 మందిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సామూహిక సెలవు పెట్టినట్టు ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల నరసింహారావు తెలిపారు. కమిషనరేట్‌లో బుధవారం డైరెక్టర్‌తో చర్చలు జరిగాయని, డిజిటల్ సర్వే విషయంలో ఉన్న సమస్యలపై మాట్లాడారని చెప్పారు. ఏదేమైనా సస్పెన్షన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు.


గల్ఫ్ బాధితులకు రూ. 20 లక్షలు మంజూరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గల్ఫ్ బాధితుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ. 20లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాలకు మొత్తం రూ. 6.45 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారు ఉత్తర్వులు జారీ చేయగా, జిల్లాకు రూ. 20 లక్షలు వచ్చాయి.

కాంగ్రెస్‌లో కాక!

ఇందిరమ్మ కమిటీల విషయంలో పాత-కొత్త నేతల మధ్య వివాదం

- పార్టీలో రెండు వర్గాల మధ్య పొరపొచ్చాలు
- ఎవరికి వారు పైచేయి సాధించేలా ప్రయత్నాలు
- నేడో రేపో రాజీ ఫార్ములాతో చర్చలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక వ్యవహారం కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. పాత వర్సెస్ కొత్త నేతలు అన్నట్టుగా వివాదం రోజురోజుకూ ముదురుపాకాన పడుతోంది.

లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ఏడుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనల ప్రకారం ప్రతీ కమిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురు, ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉండాలి. ఈ ఐదుగురితో పాటు ప్రతీ కమిటీలో ప్రభుత్వం తరఫున గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేకాధికారి, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలర్, వార్డు అధికారులకు స్థానం కల్పించాలి. మండల స్థాయిలో ఎంపీడీఓ, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఈ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉంటుంది. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి.

ఎమ్మెల్యేలు సూచించిన పేర్లే..!

కాగితాలపై నిబంధనలు ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఎంపికకు సంబంధించి ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ అనుయాయుల పేర్లను సూచిస్తున్నారు. దాదాపుగా స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన పేర్లనే ఖరారు చేస్తారనే ప్రచారం జోరందుకుంది. దీంతో ఆ పార్టీలోని మరో వర్గం వారు రంగంలోకి దిగారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపికలో ఎమ్మెల్యేలతో పాటు పార్టీ కోసం శ్రమించిన వారి మాటకు విలువ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

వారంతా కొత్తవారే..

గతేడాది నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి నేతగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు పొంగులేటి అనుచరుడిగా ముద్ర పడిన తెల్లం వెంకట్రావు, పొంగులేటి చేయి విడిచి బీఆర్‌ఎస్‌లో చేరి భద్రాచలం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే తిరిగి ఆయన కాంగ్రెస్ క్యాంపులో కలిసిపోయారు. దీంతో వీరంతా కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినవారే అనే వాదనను డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్గీయులు వినిపిస్తున్నారు.

ఎవరికి వారుగా జాబితాలు..

ఇందిరమ్మ కమిటీల్లో స్థానం కల్పించాల్సిన సభ్యుల పేర్లను సూచిస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఇప్పటికే ఓ జాబితా అందించగా జిల్లా కాంగ్రెస్ కమిటీ మరో జాబితా తయారుచేస్తోంది. ఇక ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల నుంచి మరో జాబితా వస్తోంది. దీంతో కమిటీ సభ్యుల ఎంపిక వ్యవహారం అధికారులకు శిరోభారంగా మారింది. ఒకరు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేరు చెబుతుంటే, మరో వర్గం వారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లేబుల్ చూపిస్తున్నారు. దీంతో మధ్యేమార్గంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది.

పాత వారికి ప్రాధాన్యతేది..?

గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారి మాటకే ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యత ఇస్తే తమ సంగతేంటని పాత నాయకులు ప్రశ్నిస్తున్నారు. పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని కాపాడుకున్న కార్యకర్తలు, నేతలకు న్యాయం ఎలా దక్కుతుందని అంటున్నారు. మరోవైపు కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐతో పాటు బీఆర్‌ఎస్ సిట్టింగ్ కౌన్సిలర్లు కూడా తమ మాట చెల్లుబాటు కావాలని పట్టుబడుతున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి.

రాజీ ఫార్ములాకు ప్రయత్నం !

కష్టకాలంలో పార్టీలో పని చేసిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో గుర్తింపు ఇస్తూనే సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్క్ కనిపించేలా రాజీ ఫార్ములాకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఒకటి, రెండు రోజుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలతో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య సమావేశం నిర్వహించే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రతీ కమిటీలో క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా పాత, కొత్త వర్గాల మధ్య 2:3 లేదా 3:2 నిష్పత్తిలో సభ్యులు ఉండేలా సర్దుబాటు చేసుకోవాలనే రాజీ ఫార్ములాను ఈ సమావేశంలో ప్రతిపాదిస్తారనే చర్చ హస్తం పార్టీలో జరుగుతోంది.

ఏసీబీ వలలో విద్యుత్ ఎల్‌ఐ

- ఇంటి నిర్మాణానికి ఓ వ్యక్తి అక్రమంగా విద్యుత్ వినియోగం
- కేసు పెట్టొద్దంటే లంచం ఇవ్వాలన్న లైన్‌ఇన్‌స్పెక్టర్
- రూ.68 వేలు డిమాండ్.. రూ.26 వేలకు ఒప్పందం
- నగదు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో ఏసీబీ డీఎస్పీ రమేష్, సిబ్బంది

పాల్వంచ: ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం అక్రమంగా కరెంట్ వినియోగించాడని, అతడిపై కేసు పెట్టకుండా ఉండాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగుకు చెందిన ఓ వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో తన పక్క ఇంటి నుంచి వాటర్ క్యూరింగ్ కోసం కరెంట్ తీసుకున్నాడు. అయితే పాల్వంచ టౌన్ -1 లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు ఇంటిని పరిశీలించి, మీటర్ లేదని, అక్రమంగా కరెంట్ వాడుతున్నందుకు కేసు పెడతామని బెదిరించాడు. కేసు పెట్టకుండా వదిలేయాలంటే రూ.68 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేనని సదరు వ్యక్తి బతిమిలాడగా రూ.30 వేలు అడిగాడు. దీంతో ఆ వ్యక్తి రూ.26 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఆ తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బుధవారం నాగరాజుకు రూ.26 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కాగా, ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని, 1064 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని రమేష్ తెలిపారు.

ఇటీవలే పాల్వంచకు బదిలీ..

సాధారణ బదిలీల్లో భాగంగా ఈనెల 11వ తేదీన నాగరాజు అన్నపురెడ్డిపల్లి నుంచి పాల్వంచ టౌన్ -1 లైన్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చాడు. కొద్ది రోజులకే ఏసీబీకి చిక్కడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కాగా, పాల్వంచలో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు ఇటీవల ఏసీబీకి పట్టుబడుతుండడం గమనార్హం. గత ఏప్రిల్ 18న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రమణి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రసన్నకుమార్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. జూలై 25న పట్టణ ఎస్‌ఐ బాణాల రాము రూ.20 వేలు, సెప్టెంబర్ 18న కలెక్టరేట్‌లో ఉద్యానవన శాఖాధికారి కుసుమ సూర్యనారాయణ రూ.1.14 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. తాజాగా లైన్‌ఇన్‌స్పెక్టర్ నాగరాజు రూ.26 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం లేనిదే పని జరగడం లేదని, ఇటీవలి ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనమని పలువురు అంటున్నారు.

ఏసీబీ వరుస దాడులు 8లో

గిరిజనులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్

భద్రాచలం: కష్టపడి చదువుకుని గిరిజన బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. భద్రాచలం గిరిజన బాలికల గురుకులంలో రూ.26 లక్షలతో ఐటీసీ నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి గిరిజనులకు నాణ్యమైన విద్యనందిస్తోందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం ఎంబీబీఎస్ సీట్లు సాధించిన బాలికలను ఘనంగా సన్మానించారు. చదరంగం క్రీడలో రాణిస్తున్న ధనుశ్రీకి ఐటీసీ రూ.25 వేల స్కాలర్‌షిప్ అందజేసింది. తొలుత ఎమ్మెల్యే, పీఓ, ఐటీసీ అధికారులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ బాలికలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల ఆర్‌సీఓ కె.నాగార్జున రావు, భద్రాచలం ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్, జనరల్ మేనేజర్ పి.శ్యామ్ కిరణ్, ఐటీసీ బీపీఎల్ మేనేజర్ చెంగల్ రావు, ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎ.పద్మావతి, రమాదేవి, ఎం.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలి

- 'వ్యవసాయ' డీలర్లు దేశీ ధ్రువపత్రాలు కలిగి ఉండాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



డీలర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ పాటిల్

చుంచుపల్లి: పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతి పెరిగేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన డీలర్లు తప్పనిసరిగా 'డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్' (దేశీ) ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. చుంచుపల్లి మండలంలోని ప్రశాంతినగర్ రైతువేదికలో బుధవారం నిర్వహించిన దేశీ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పరిధిలో 40 మంది వ్యవసాయ, అనుబంధ రంగాల డీలర్లకు దేశీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారం చేస్తున్న వారికి దేశీ పేరుతో 12 నెలల డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని, వ్యవసాయ శాఖలో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులు, శాస్త్రవేత్తలతో ప్రతీ ఆదివారం 48 వారాల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, భూసార పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, నీటి యాజమాన్యం వంటి అంశాలను వివరిస్తారని చెప్పారు. దేశీ సభ్యులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. ఎప్పుడూ ఒకే పంట కాకుండా ఎక్కువ ఆదాయం వచ్చే మునగ, వెదురు, టమాట, బెండ, దోస తదితర పంటలను సేంద్రియ విధానంలో పండించేలా రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు మాట్లాడుతూ సభ్యులకు మునగ సాగు, దాని ద్వారా వచ్చే ఆదాయం గురించి వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ వ్యవసాయాధికారి డేవిడ్ జయపాల్, దేశీ వ్యవసాయ కోర్సు శిక్షకుడు జి.దీపక్, మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల ఏర్పాట్ల పరిశీలన..

కొత్తగూడెంరూరల్: ఈనెల 28న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కబడ్డీ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు కబడ్డీ పోటీలు జరుగనున్నాయి.

సమరశీల పోరాటాలకు సిద్ధం కండి

- 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలుచేయాలి
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అటకెక్కించింది
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



మహాసభలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి, పక్కన రాష్ట్ర, జాతీయ నాయకురాళ్లు

సింగరేణి(కొత్తగూడెం): మహిళల హక్కుల సాధనతో పాటు ఎన్నికల ముందు పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేసేలా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుకు కార్యాచరణ, నిధుల కేటాయింపు వంటి ఊసే లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలవుతోందని, మిగితా వాటిని అటకెక్కించారని ఆరోపించారు. 200లోపు యూనిట్ల విద్యుత్ వినియోగిస్తే జీరో బిల్లు పథకం 50 శాతం మాత్రమే అమల్లోకి వచ్చిందని, రూ.500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500 నగదు పంపిణీ, వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు రూ.12 వేల ఆర్థిక సహాయం వంటివి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి, హెరాయిన్, కొకేన్ వంటి ప్రమాదకర డ్రగ్స్ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందని, దీంతో పలు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ పద్మజాషా మాట్లాడుతూ.. మహిళలు దేశానికి లెక్కలేని సంపద అందిస్తున్నారని, కానీ ప్రభుత్వాలు ఆ లెక్కలను చూపడం లేదని అన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మహిళలను అణచివేసేలా ఉన్నాయని విమర్శించారు. పనిచేసే స్థలాల్లో లైంగిక వేధింపులతో పాటు కనీస వేతనాలు అందక మహిళలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉన్నా.. బీజేపీ వంటి పార్టీలు ఇందుకు గొడ్డలిపెట్టుగా మారాయని ఆరోపించారు. ఇలాంటి సమస్యలపై మహిళలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఐద్వా జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకురాళ్లు పీ.కే. శ్రీమతి, మరియం ధావలె, ఎస్.పుణ్యవతి, సుధా సుందర్ రామన్, అరుణజ్యోతి, ప్రభావతి, గీతారాణి, డి.అనిత, వినోద, టి.జ్యోతి, బుగ్గవీటి సరళ, ఆశాలత, అనురాధ, మాచర్ల భారతి, రత్నమాల, బండి పద్మ, డి.ఇందిర, నాగలక్ష్మి, ఎం జ్యోతి, డి.సీతాలక్ష్మి, సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, డాక్టర్ నీలిమ, డీవైఎఫ్ఐ నాయకులు అనుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పు వాడకాన్ని ప్రోత్సహించాలి

డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ప్రజలంతా అయోడైజ్డ్ ఉప్పు వినియోగించేలా అవగాహన కల్పించాలని, ఈ మేరకు అందరినీ ప్రోత్సహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పేషెంట్లకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన అయోడిన్ లోప నివారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అయోడైజ్డ్ ఉప్పు ప్రాముఖ్యతను వివరించారు. అయోడైజ్డ్ చేయని ఉప్పు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రజలందరికీ ఈ విషయాలను తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సిబ్బంది ఎస్తేర్‌రాణి, ప్రకాశరావు, హేమ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..

కొత్తగూడెంరూరల్ : అయోడిన్ లోపాల రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు ఐదు గ్రాముల అయోడిన్ ఉప్పు మాత్రమే వాడాలని, తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చురుకుదనం, జ్ఞాపకశక్తి కలుగుతాయని వివరించారు. గర్భిణులు అయోడిన్ ఉప్పు వాడకుంటే గర్భస్రావం, మృత శిశువు జననం, తక్కువ బరువుతో బిడ్డలు పుట్టడం వంటి సమస్యలు ఏర్పడుతాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మధువన్, బాలాజీ, ఫయాజుద్దీన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భాస్కర్‌నాయక్ తదితరులు

చిన్నారులతో పని చేయించడం నేరం

కొత్తగూడెంఅర్బన్: చిన్నారులతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా చదివించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం ఆమె కొత్తగూడెం చిన్న బజార్, పెద్ద బజార్లలోని కిరాణం దుకాణాలు, షాపింగ్ మాల్స్, ఇతర వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. చిన్న బజారులోని ఓ కిరాణా షాపులో బాల కార్మికుడిని గుర్తించి అతడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడి తల్లిని పిలిపించి తప్పనిసరిగా బడిలో చేర్పించాలని సూచించారు. 14 ఏళ్ల లోపు పిల్ల లను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక చట్టం ప్రకారం యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలుడిని బడిలో చేర్పించే బాధ్యతను తల్లితో పాటు షాపు యజమాని కూడా తీసుకోవాలన్నారు. స్కూల్‌లో అడ్మిషన్ చేయించిన తర్వాత వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో సహాయ కార్మిక శాఖ అధికారి మహమ్మద్ షర్ఫుద్దీన్, న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ పోస్టు ఈ విద్యా సంవత్సరం చివరి పనిరోజుల వరకు అతిథి అధ్యాపక విధానంలో తీసుకోవాలని నిర్ణయించినట్లు వివరించారు. బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్/ తత్సమాన డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30లోగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ అమ్మకాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఓ ఏజెన్సీ కాలం చెల్లిన కూల్ డ్రింక్‌లను సరఫరా చేస్తోంది. పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఉన్న ఓ కిరాణా షాప్‌లో వినియోగదారుడు కూల్ డ్రింక్ కొనుగోలు చేసి తాగాడు. దీంతో కొంత ఇబ్బందిగా అనిపించడంతో అనుమానం వచ్చి కూల్ డ్రింక్ ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించగా, సెప్టెంబర్ 11వ తేదీనే ముగిసినట్లు ఉంది. మరో ఐదు రోజుల తర్వాత అదే షాప్‌లో మళ్లీ ఓ కూల్ డ్రింక్ కొంటే జూలై 19న గడువు ముగిసిన డ్రింక్‌ను విక్రయించారు. షాపు యజమానిని ప్రశ్నిస్తే తాము పరిశీలించలేదని, ఈ కూల్ డ్రింకులను ఇటీవలే ఏజెన్సీ నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలం చెల్లిన కూల్ డ్రింక్‌ల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచ: కేటీపీఎస్ రైల్వే ట్రాక్‌పై బుధవారం యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు సమీపంలో సింగరేణి నుంచి కేటీపీఎస్ వరకు ఉన్న రైల్వే లైన్ పట్టాలపై గాంధీనగర్‌కు చెందిన యాకూబ్‌పాషా(28) అడ్డుగా ఉండటంతో బొగ్గు వ్యాగన్ ఢీ కొట్టింది. దీంతో శరీర భాగాలు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. ఈ విషయమై ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. ఇంకా ఫిర్యాదు రాలేదని, వ్యాగన్ ఢీ కొట్టడంతో మృతి చెందాడని తెలిపారు.

ఫెన్సింగ్ ధ్వంసంపై కేసు నమోదు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించి, సరిహద్దుకు రక్షణగా ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రం దమ్మపేటకు చెందిన కొలూరి సాయిబాబు కుటుంబ సభ్యులకు ఉమ్మడిగా పెద్దగొల్లగూడెం గ్రామంలో వ్యవసాయ క్షేత్రం ఉంది. దమ్మపేట గ్రామానికే చెందిన కొలూరి వెంకటేశ్వరరావు, కొలూరి రామకృష్ణలకు ఈ భూమి విషయంలో సాయిబాబు కుటుంబ సభ్యులతో కొంత కాలంగా వివాదం నెలకొంది. దీంతో వెంకటేశ్వరరావు, రామకృష్ణ గత ఆగస్టు 30న అక్రమంగా భూమిలోకి ప్రవేశించి ఫెన్సింగ్ రాళ్లు, ఇనుప తీగను తొలగించి సరిహద్దును ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. పోలీసులు స్థానిక సంత మార్కెట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అశ్వారావుపేటకు తరలిస్తున్నారు. అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఈ ఘటనలో వడ్డెర బజారుకు చెందిన వల్లెపు శివనాగుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.36 వేలు స్వాహా

వైరా: వైరాలోని ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎంకు వచ్చిన వ్యక్తి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చి నగదు కాజేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్‌కు చెందిన భూక్యా మదన్ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. ఆయనకు అవగాహన లేకపోవడాన్ని గుర్తించిన అక్కడే ఉన్న ఓ వ్యక్తి సాయం చేస్తానని చెప్పి కార్డు తీసుకుని డ్రా చేస్తున్నట్లు నటించి ఆ తర్వాత మరో కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. కాసేపటికి మదన్ బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.36,900 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఫోన్‌పే ద్వారా మదన్ తన మిత్రుడికి రూ.10 వేలు బదిలీ చేశాడు. ఆ తర్వాత బ్యాంకుకు వెళ్లి వివరాలు ఆరా తీయగా బోనకల్ ఏటీఎంలో రూ.36,900 డ్రా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. కాగా, మదన్ ఖాతా నుంచి నగదు డ్రా చేసిన వ్యక్తే నెల కిందట ముసలిమడుగుకు చెందిన మహిళ కార్డు కూడా మార్చి నగదు కాజేసినట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ఘటనపై వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

ఏసీబీ వరుస దాడులు

అవినీతి ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్న అధికారులు

- సమాచారం అందగానే పక్కా ప్రణాళికతో తనిఖీలు
- గత పది నెలల కాలంలో పట్టుబడిన 10 మంది
- సుమారు రూ. 4 లక్షల నగదు స్వాధీనం



అశ్వారావుపేట ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద డ్రైవర్ వేషధారణలో ఏసీబీ అధికారి(ఫైల్)

పాల్వంచరూరల్: సామాన్యుడు ఏదైనా పని కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తే చేయి తడపనిదే అధికారులు పనిచేయడంలేదు. దీంతో విసిగిపోయి ప్రజలు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ అధికారులు చేస్తున్న వరుస దాడులు వినీతిపరుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల లంచం పుచ్చుకుంటూ పట్టుబడుతున్న అధికారుల సంఖ్యే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

పట్టుబడితే 40 రోజుల రిమాండ్

జిల్లాలో గత జనవరి నుంచి నేటి వరకు ఏసీబీ అధికారులు డీఎస్పీ వై.రమేష్ నేతృత్వంలో దాడులు నిర్వహించగా, అవినీతికి పాల్పడిన పది మంది అధికారులు ఏసీబీకి చిక్కి కటకటాలపాలయ్యారు. రూ.3.95 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు అందగానే తక్షణమే స్పందిస్తున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు వల వేసి అక్రమార్కులను పట్టుకున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట ఆర్టీఏ చెక్‌పోస్టులో వాహనదారుల నుంచి లంచం తీసుకుంటున్నట్లు సమాచారం అందింది. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ వేషధారణలో వెళ్లి అవినీతికి పాల్పడిన ఏఎంవీఐ వెంకట్‌రెడ్డిని గత ఏప్రిల్ 29న అరెస్ట్ చేశారు. కాగా ప్రభుత్వశాఖలలో విధులు నిర్వహించే ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ పట్టుబడితే చట్టప్రకారం 40 రోజులపాటు రిమాండ్ చేస్తామని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

పాల్వంచ అధికారులే అధికం

ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ ప్రభుత్వ శాఖల అధికారుల్లో పాల్వంచలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులే ఎక్కువగా ఉన్నారు. మూడేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న పద్మ కల్యాణ లక్ష్మి చెక్కు విషయంలో అవినీతికి పాల్పడగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు అదే సంవత్సరం తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ రూ. 3 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అలవర్ట్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ సంవత్సరం మున్సిపల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటరమణి, ప్రసన్న కుమార్, పట్టణ ఎస్‌ఐ.రాము, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఏసీబీ అధికారులకు చిక్కారు. ఇలా మొత్తం ఏడుగురు పట్టుబడ్డారు.

ఎప్పుడు.. ఎవరు పట్టుబడ్డారంటే..?

- ▶ జనవరి 29న ఖమ్మం జిల్లా కేంద్రంలోని టూటౌన్‌లో రూ. 50 వేలు లంచం తీసుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్ పి.కోటేశ్వరరావును పట్టుకున్నారు.
- ▶ ఏప్రిల్ 18న పాల్వంచ మున్సిపాలిటీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అక్కిరెడ్డి వెంకటరమణి, ప్రసన్నకుమార్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- ▶ ఆ తర్వాత భద్రాచలం పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్ రూ.25వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ▶ మే 16న అశ్వారావుపేటలో విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ దారవత్ శంకర్ రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- ▶ మే 23న చర్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు రూ.20వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు.
- ▶ జూలై 25న పాల్వంచ పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బాణాల రాము రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.
- ▶ ఆగస్టు 21న ఆళ్లపల్లి మండల పంచాయతీ అధికారి బత్తిని శ్రీనివాసరావు రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.
- ▶ సెప్టెంబర్ 18న జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి కె.సూర్యనారాయణ రూ.1.14 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.
- ▶ తాజాగా పాల్వంచ విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రూ.26 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

1064కు సమాచారం ఇవ్వండి



ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ ఖు 1064 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. మీ పేర్లు గోప్యంగా ఉంచుతాం. అవినీతి అధికారులను పట్టించే విషయంలో ప్రజలు భయపడొద్దు. నిర్భయంగా ముందుకు వచ్చి మాకు సమాచారం ఇవ్వాలి.

– వై.రమేష్, ఏసీబీ డీఎస్పీ

చిట్టితల్లికి పెద్ద కష్టం

- 18 నెలల చిన్నారికి హృదయ సంబంధ సమస్య
- శస్త్ర చికిత్సకు రూ.5 లక్షల వరకు ఖర్చు
- దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



తల్లి భారతితో చిన్నారి నిర్విజ్ఞ

సుజాతనగర్: పద్దెనిమిది నెలల చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. పాప అనారోగ్యానికి గురికాగా తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండె సమస్య ఉందని, శస్త్ర చికిత్స నిర్వహించాలని తెలిపారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బానోత్ హరి, భారతి దంపతులకు ఒకే కుమార్తె ఉంది. 18 నెలల ఈ చిన్నారి పేరు నిర్విజ్ఞ. చిన్నారి తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో వైద్యం నిమిత్తం ఇటీవల కొత్తగూడెం తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి చిన్నారి గుండె గదుల్లోకి రక్త సరఫరా సరిగ్గా లేదని చెప్పారు. ఆపరేషన్ చేయాలని, సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో... ఆ నిరుపేద కుటుంబం ఆపన్న హస్తం కోసం ఆశతో ఎదురుచూస్తోంది.

ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నా..

వీరి కుటుంబానికి ఆరోగ్య శ్రీ కార్డు ఉండటంతో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు. కానీ ఆపరేషన్ చేయాలంటే బెలూన్ కావాల్సి ఉంది. ఆ బెలూన్‌కు ఖర్చు సుమారు రూ. రెండు లక్షల వరకు అయ్యే అవకాశం ఉంది. పని చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితుల్లో ఉన్న వారు అంత డబ్బు ఎక్కడి నుంచో తేవాలో అర్థంకాక చిన్నారిని చూస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు. దాతలు స్పందించి ఆర్థికసాయం చేయాలని వేడుకుంటున్నారు.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
8309816518
అకౌంట్ నంబరు:
32987267840
ఎస్‌బీఐ, కొత్తగూడెం
గణేష్ టెంపుల్ బ్రాంచ్
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0011082

డీసీసీబీలో మరో అవినీతి పర్వం

- ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో బయటపడిన వ్యవహారం
- నకిలీ ధ్రువపత్రాలతో 16 యూనిట్లకు రుణాలు
- అసలు, వడ్డీ కలిపి రూ.3 కోట్ల మేర అక్రమాలు



డీసీసీబీ ఖమ్మం రూరల్ బ్రాంచ్ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో మరో అవినీతి వ్యవహారం వెలుగు చూసింది. బ్యాంకు ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో రూ.కోట్లలో అవినీతి జరిగినట్లు బయటపడింది. గతంలో వివిధ బ్రాంచ్‌ల ద్వారా నకిలీ ధ్రువపత్రాలతో 21 మందికి రూ.6 కోట్ల మేర మార్టిగేజ్ రుణాలు ఇచ్చిన వ్యవహారం 2022లో బయటపడిన విషయం విదితమే. అయితే, విచారణ చేపట్టినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. ఇంతలోనే ఖమ్మం రూరల్ శాఖ మేనేజర్ బదిలీ కావడం.. కొత్త మేనేజర్ వచ్చి రికార్డులు పరిశీలించడంతో అక్రమం బయటపడింది.

రూ.1.60కోట్ల మేర రుణాలు..

నాబార్డ్ సంస్థ 2019లో సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. ఈమేరకు డీసీసీబీ ఖమ్మం రూరల్ బ్రాంచ్ ద్వారా 16 మందికి నకిలీ ధ్రువపత్రాలతో గొర్రెలు, గేదెలు, మేకలు, ఫౌల్ట్రీ తదితర యూనిట్లకు రుణాలు జారీ చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ. 10 లక్షల మేర సుమారు రూ.1.60 కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఇది వడ్డీ కలిపి రూ.3 కోట్లకు చేరాయి. గతంలో ఇక్కడ ఉన్న మేనేజర్ బదిలీ కాగా, ఆ స్థానంలో కొత్త మేనేజర్ రావడంతో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం బయటపడింది. రుణం వసూళ్లకు మార్టిగేజ్ చేసిన భూములను వేలం వేయాలని భావిస్తుండగా సదరు భూములు ఇతరుల పేరిట ఉన్నాయని గుర్తించారు.

డీజీఎంతో విచారణ పూర్తి

ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లో అక్రమాలు బయటపడడంతో విచారణ అధికారిగా డీజీఎం సర్వేశ్వరరావును సీఈఓ వసంతరావు నియమించారు. ఇటీవలే విచారణ పూర్తి చేసిన ఆయన నివేదిక సమర్పించారు. అనంతరం సీఈఓ రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్(ఆర్సీఎస్)కు నివేదించడంతో అక్కడి నుంచి విచారణ జరిపించే అవకాశముంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 పీఏసీఎస్‌లు, 50 బ్రాంచ్‌లతో విస్తరించి రూ.3 వేల కోట్లకు పైగా లావాదేవీలతో కొనసాగుతున్న డీసీసీబీలో తరచుగా అక్రమాలు బయటపడుతుండడంతో ఖాతాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై సీఈఓ వసంతరావును వివరణ కోరగా ఖమ్మం రూరల్ బ్రాంచిలో అక్రమాల వ్యవహారంపై విచారణ జరిపించడమే కాక రాష్ట్ర సహకార శాఖకు నివేదించామని తెలిపారు.

ఏఎన్‌ఎం శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ఏఎన్‌ఎం శిక్షణకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఇంటర్‌లో ఏ గ్రూప్ అయినా పూర్తి చేసి, 17ఏళ్లు నిండిన ఉమ్మడి జిల్లాలోని మహిళలు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సెస్సీ మెమో, 4నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలతో పాటు 'కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్' పేరిట తీసిన రూ.200 డీడీతో మహిళా ప్రాంగణానికి వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

బాణసంచా స్వాధీనం



పోలీసులు పట్టుకున్న బాణసంచా

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4 లక్షల విలువైన బాణసంచాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం పట్టుబడిన బాణసంచాను స్థానిక పోలీసులకు అప్పగించారు. నిబంధనలు విరుద్ధంగా ఉన్న నిల్వ ఉంచడంతో స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

స్కూల్‌లో కోతుల బీభత్సం

పెనుబల్లి: టేకులపల్లి మోడల్ స్కూల్‌లో బుధవారం కోతులు బీభత్సం సృష్టించాయి. విద్యార్థులు తరగతి గదుల నుంచి మొదటి అంతస్తులోని హాస్టల్‌కు వెళ్తుండగా అక్కడ ఉన్న కోతులు పైకి వచ్చాయి. దీంతో ఆందోళనకు గురైన చరిత, వైష్ణవి మెట్లపై నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, విద్యార్థినుల వెంట వార్డెన్, అధ్యాపకులు వెళ్లకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నష్టపరిహారం చెల్లించాలి

విత్తన దుకాణాల వద్ద రైతుల నిరసన



విత్తనాలు కొనుగోలు చేసినట్లు రశీదులు చూపిస్తున్న రైతులు

సుజాతనగర్: నకిలీ విత్తనాలతో మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం పలువురు రైతులు ఆందోళనకు దిగారు. విత్తనాలు కొనుగోలు చేసిన సుజాతనగర్‌లోని రెండు దుకాణాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రుగొండ, సుజాతనగర్ మండలాలకు చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ సుమారు 20 మంది రైతులు 100 ఎకరాల విస్తీర్ణంలో ఎంటీయూ 1262 రకాన్ని సాగు చేశారు. పంట వేసిన 90 రోజులకే కంకులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 10 బస్తాల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేయగా, వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వచ్చి పంటలను పరిశీలించారని తెలిపారు. న్యాయం చేస్తామని వ్యవసాయాధికారులు పది రోజులుగా చెబుతున్నారనే తప్ప పరిష్కారం చూపడం లేదన్నారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ యాజమాన్యం వారిని పిలిపించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని విత్తన డీలర్లు తెలిపారు. ఈ ఆందోళనలో రైతులు నల్లగోపు పుల్లయ్య, షేక్ మహబూబ్ అలీ, షేక్ మౌలాలితోపాటు మరికొందరు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని..

ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత



మణుగూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మణుగూరు టౌన్: మండల పరిధిలోని సమితి సింగారం అరుంధతి నగర్‌లో ఉన్న ఎంపీపీఎస్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విపరీతమైన వాంతులతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఉపాధ్యాయుడు శ్రీకాంత్ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాలుగో తరగతి చదువుతున్న ఎం.పట్టాభి, భార్గవి, లాస్య, సంతోష్, అభిరాం, రెండో తరగతికి చెందిన ఇందు, గీతిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. ఆ వెంటనే వాంతులు ప్రారంభమయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎంఈఓ స్వర్ణజ్యోతిని వివరణ కోరగా.. మధ్యాహ్న భోజనంలో అన్నం, ఆకు కూర పప్పు, అరటిపండు అందించారని, ఇలా ఎందుకు జరిగిందనే విషయమై విచారణ చేస్తామని తెలిపారు. కాగా, ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ.. ఆహారం కలుషితమైతే తిన్న వెంటనే వాంతులు కావని, కనీసం అరగంట సమయం పడుతుందని చెప్పారు. విద్యార్థుల అస్వస్థతకు కారణం తెలియడం లేదన్నారు. అయితే ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- 3.3 కిలోల వెండి, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు



మాట్లాడుతున్న ఏసీపీ అనిశెట్టి రఘు

సత్తుపల్లి/వేంసూరు: దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు వివరాలు వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగ్రంచిప్రోలుకు చెందిన ఎల్లబోయిన గోపి, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ అలియాస్ కిట్టుతో పాటు ఒక బాల నేరస్తుడు ముఠాగా ఏర్పడి సుమారు 20 ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వేంసూరు మండలం వెంకటాపురంలోని అంకమ్మతల్లి ఆలయంలో సెప్టెంబర్ 28న తలుపులు పగులగొట్టి అమ్మవారి నగలు, కిరీటం, వెండి పాత్రలు, బంగారు గొలుసుతోపాటు హుండీలోని రూ.1.50 లక్షలు అపహరించారని, సత్తెమ్మతల్లి గుడిలో దొంగిలించిన బంగారు సూత్రాలను విక్రయించగా వచ్చిన నగదును గోపి ఇంట్లో దాచిపెట్టారని చెప్పారు. మధిర, వత్సవాయి మండలాల్లో కూడా వీరిపై చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. కిరీటాల్లోని వెండి, బంగారం కరిగించడమే కాక, చోరీలు చేయటానికి రెండు పల్సర్ ద్విచక్రవాహనాలను కూడా చోరీ చేశారని ఏసీపీ తెలిపారు. కాగా, నిందితుల నుంచి 3.3 కిలోల వెండి, రూ.1.50 లక్షల నగదు, రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

పెనుబల్లి మండలంలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న ఎస్‌కే మౌలాలీని పెనుబల్లి ఎస్‌ఐ వెంకటేష్ నేతృత్వాన అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. పాత కారాయిగూడెంలో స్కూటీ, తిరువూరులో చోరీ చేసిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, తెలంగాణ నుంచి ఏపీకి మద్యం తరలించిన ఘటనతో పాటు వ్యవసాయ మోటార్ చోరీ కేసులు ఆయనపై ఉన్నాయని చెప్పారు. సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్‌ఐలు వీరప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు. కాగా, కేసుల ఛేదనలో కృషి చేసిన వేంసూరు, పెనుబల్లి ఎస్‌ఐలు వీరప్రసాద్, వెంకటేశ్, సిబ్బంది రాజమల్లు, సత్యనారాయణను సీపీ సునీల్‌దత్ అభినందించి నగదు రివార్డు ప్రకటించారని ఏసీపీ తెలిపారు.

ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన మావోయిస్టు మిలీషియా సభ్యులు

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దబండిరేవు గ్రామం క్రాస్ రోడ్డు దగ్గర జరి గిన వాహన తనిఖీల్లో ఇద్దరు మావో యిస్టు మిలీషియా సభ్యులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ గణేష్ కథనం ప్రకారం.. ఎస్‌ఐ వెంకటప్పయ్య, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బందితో కలిసి సీతానగరం గ్రామశివారులో పెద్దబండిరేవు క్రాస్ రోడ్డు దగ్గర వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, వారిని ఆపి విచారించారు. వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంపూర్ గ్రామానికి చెందిన పొడియం కమ్లు అలియాస్ రాజ్ కుమార్, మడకం సోంబారుగా తేలింది. మావోయిస్ట్ పార్టీ గంపూర్ ఆర్పీసీలో మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. వారు మావోయిస్టులకు ఇచ్చేందుకు తీసుకెళ్తున్న 50 మీటర్ల కార్డెక్స్ వైర్, రూ.11,500 స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జన్మదినం రోజే గుండెపోటుతో యువకుడు మృతి



సాయికిశోర్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : కుమారుడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇంట్లో ఏర్పాట్లు చేస్తుండగానే.. ఆ తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చి తనయుడు తనువు చాలించాడు. అన్నపురెడ్డిపల్లి మండలం నామవరంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివాలయ పూజారి శివరామమూర్తి కుమారుడు సాయికిశోర్(28) రాజాపురంలో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. బుధవారం అతడి పుట్టినరోజు కాగా, వేడుకల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్తున్న సాయికిషోర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలోకి చేరిన అతడిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. జన్మదినం రోజే సాయికిశోర్ మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది.

జ్వరంతో బాలిక మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చింతవొర్రె గ్రామానికి చెందిన బాలిక(9) జ్వరంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. చింతవొర్రె గ్రామంలో బాలికపై గతంలో అత్యాచారం జరిగింది. ఈ సంఘటనలో బాధ్యుడైన ఉపాధ్యాయుడికి జీవిత ఖైదు శిక్ష పడిన విషయం అందరికి విదితమే. కాగా బాలిక వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి తీసుకెళ్లిన జ్వరం తగ్గకపోవడంతో నిన్న మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, నాయకులు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

నేలకొండపల్లి: వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని నేలకొండపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోదాడ నుంచి ఖమ్మంకు బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఆపి వివరాలు ఆరా తీశారు. ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఏపీలోని అమలాపురానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగగా గుర్తించినట్లు సమాచారం. ఏపీలో చోరీలకు పాల్పడిన ఆయనపై కేసులు ఉన్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయమై ఎస్‌ఐ పి.సంతోష్‌తో మాట్లాడగా వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.